గురుకుల కళాశాలల్లో మిగులు సీట్ల భర్తీకి చర్యలు

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల జూనియర్ కళాశాలల్లో మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాదిలో టెన్త్ పాసైన గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మెరిట్, మార్కులు ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. బాలుర కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీతో పాటు ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 31 సీట్లు, బాలికల కళాశాలల్లో ఆరు సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ నెల 20న స్థానిక బాలుర కళాశాల ఆవరణలో కౌన్సిలింగ్ నిర్వహిస్తామని చెప్పారు.

చివరి ఎకరాకూ నీరందాలి

- సాగునీటి ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక ఇవ్వాలి
- అక్రమ పింఛన్లు తొలగిస్తాం.. అర్హులకు అందజేస్తాం
- మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్
- వాడీవేడిగా జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

విజయనగరం/పార్వతీపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): సాగునీటి ప్రాజెక్టుల ద్వారా చివరి ఎకరా వరకూ నీరు అందించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'అర్హులందరకీ సంక్షేమ పథకాలు అందించడమే టీడీపీ కూటమి ప్రభుత్వ లక్ష్యం.. ఖరీఫ్ రైతులు అడిగిన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించాలి. గతంలో 1121 వరి విత్తనాలతో రైతులకు నష్టం వాటిల్లింది. నష్టపరిహారం వారికి సక్రమంగా అందలేదు. నకిలీ విత్తనాలు, ఎరువులు రాకుండా చూడాలి. గిరిజనులకు 90 శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు, ఎరువులు, విత్తనాలు అందచేయాలి. సాగునీటి ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక ఇవ్వండి. కొత్త ప్రాజెక్టులు, కాలువల కంటే ప్రస్తుతం ఉన్న కాలువలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవడంపై దృష్టి సారించాలి. ఉపాధి హామీ పథకం ద్వారా కాలువల్లో పూడికలు, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలి.' అని సూచించారు.

కొత్త జిల్లాలో వసతులేవీ?

గత వైసీపీ ప్రభుత్వం ఎంతో హడావుడిగా పార్వతీపురం మన్యం జిల్లాను ఏర్పాటు చేసింది.. కనీసం అధికారులకు కార్యాలయాలు.. నివాస భవనాలు ఏర్పాటు చేయలేదు. వైటీసీలో ఎస్పీ కార్యాలయం నిర్వహించాల్సి వస్తోంది. ప్రాజెక్టు అధికారి బంగ్లాను జాయింట్ కలెక్టర్‌కు కేటాయించారు. జిల్లా కేంద్రంలో ఏ కార్యాలయానికి కూడా భవనాన్ని నిర్మించలేదు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు సకాలంలో విధులకు హాజరుకావడం లేదు. ఈ పద్ధతి మార్చుకోవాలి. గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా వదిలేసింది. కనీసం కాలువల్లో పూడికలు కూడా తీయించలేదు. బిల్లులు చెల్లింపులు కాకపోవడంతో ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిస్థితి దారుణంగా ఉంది. గత ప్రభుత్వం అంబులెన్స్‌లను కూడా మరమ్మతులు చేయించలేకపోయింది. సికిల్‌సెల్ ఎనిమియా నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్ల సంఖ్య పెంచాలి. మలేరియా మందుల వినియోగంలో ప్రజలకు అవగాహన కల్పించాలి.' ఆసుపత్రుల్లో రాత్రి సమయంలో కూడా గైనకాలజిస్టు లతో పాటు చిన్న పిల్లల వైద్యులు అందుబాటులో ఉండాలి. కొండలు దిగి వచ్చిన గిరిజనులకు ఎరువులు ఇవ్వకుండా పంపించరాదు.' అని తెలిపారు.

'జైకా నిధులతో ఎందుకు పనులు పూర్తి చేయలేకపోయారు.. 20 శాతం పనులు పూర్తి చేసేందుకు ఐదేళ్లు పట్టింది.. మిగిలిన 80 శాతం పనులు పూర్తి చేసేందుకు 20 ఏళ్లు పడుతుందా?' అని మంత్రి సంధ్యారాణి ఇరిగేషన్ శాఖ అధికారులను ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం ద్వారా సాగునీటి ప్రాజెక్టుల పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వాటిపై నివేదిక తయారు చేసి అందించాలన్నారు. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో ప్రత్యేక వైద్య నిపుణులు లేకపోవడం దారుణమన్నారు. ఇంతవరకు నియామకాలు ఎందుకు చేపట్టలేదని అధికారులను మంత్రి ప్రశ్నించారు. మలేరియా, డెంగ్యూ, బోధకాలు వ్యాధుల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని మొత్తం 11 ప్రాజెక్టుల్లో 129 పనులకు రూ.8.29 కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు నార్త్‌కోస్టల్ సీఈ సుగణకరరావు తెలిపారు. 237 మంది లష్కర్ల నియామకానికి కూడా ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.

- అరకు ఎంపీ తనూజరాణి మాట్లాడుతూ.. వర్షకాలంలో గిరిశిఖర గ్రామాల్లో వ్యాధులు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. గర్భిణులు, బాలింతల మరణాలను నివారించాలన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

- జంఝావతి, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఒడిశాతో సంబంధం లేని పెండింగ్ పనులు కూడా ఎందుకు పూర్తి చేయడం లేదని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచం ద్ర ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. ఒడిశాతో ఉన్న వివాదాన్ని పరిష్క రిస్తామన్న హామీ ఇచ్చిన గత వైసీపీ ప్రభుత్వం.. మాట తప్పిందన్నారు. వరహాలగెడ్డతో పాటు అనేక చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా.. ఇరిగేషన్‌శాఖ ఎందుకు పట్టించు కోవడం లేదో అర్థం కావడం లేదన్నారు. అడారుగెడ్డ రిజర్వాయర్ నిర్మాణాన్ని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. పెదంకలం ప్రాజెక్టు ఆధునికీకరణకు జైకా నిధులు మంజూరైనా గత ప్రభుత్వం కనీసం పది శాతం పనులు కూడా పూర్తి చేయించలేకపోయిందని తెలిపారు. పార్వతీపురం పరిధి జగన్నాథపురం ఆరోగ్య కేం ద్రంలో రోగులకు పరీక్షించేందుకు కనీసం బీపీ మిషన్లు లేకపోవడం దారుణమన్నారు.
- గిరిజనులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి.. వారికి అవసరమైన అపరాల విత్తనాలు అందించాలని కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి కోరారు. తమ నియోజకవర్గంలో శిథిలమైన ఆసుప్రతుల్లోనే వైద్య సేవలు అందిస్తున్నారని, కొత్త భవనాలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయని ప్రశ్నించారు. దీనిపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

పింఛన్లపై సమీక్ష....

ఉమ్మడి జిల్లాలో పింఛన్ల పంపిణీలో జరిగిన అక్రమాలపై విచారణ చేపడతామని మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కె.శ్రీనివాస్ హెచ్చరించారు. ఆధార్ కార్డులను ట్యాంపరింగ్ చేసి, తప్పుడు ధ్రువపత్రాలతో పింఛన్లు తీసుకున్న వారిపై, వారికి సహకరించిన వారిపై చర్యలు ఉంటాయన్నారు. అక్రమ పింఛన్లను రద్దు చేస్తామని, దీన్ని ఎవరూ రాజకీయం చేయ వద్దని, ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

గతానికి భిన్నంగా జడ్పీ సమావేశం..

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జూలై 12: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశం గతానికి భిన్నంగా సాగింది. గతంలో జడ్పీ సర్వసభ్య సమావేశాలు అంటే టూ మెన్ షో (జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొత్స సత్యనారాయణ) అనే విధంగా ఉండేవి. వీరిద్దరి ముందు ఎమ్మెల్యేలు గానీ, జడ్పీటీసీలు, ఎంపీపీలు గానీ ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం ఉండేది కాదు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెబుతుండగానే.. వీరు మధ్యలో కల్పించుకుని వాటికి సమాధానాలు చెప్పేసేవారు. లేదంటే. సదరు అధికారిని ఆ సమస్య పరిష్కరించమని చెప్పి ఆదేశించి.. అక్కడితో ఆ చర్చ ముగిసే విధంగా చేసేవారు. కనుసైగలతో జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని నడిపించేవారు. వీరు చెప్పినట్టే అధికారులు సైతం తలూపేవారు. ప్రజా ప్రతినిధులు లోలోపల బాధపడినా వారిద్దరి ముందు మాట్లాడలేక, ఆయా సమస్యలు పరిష్కరించలేక సతమత మయ్యేవారు. అయితే, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారి జరిగిన జడ్పీ సమావేశం గతానికి భిన్నంగా సాగింది. ఉమ్మడి జిల్లాలో ఒక్క ఎమ్మెల్యే కూడా వైసీపీకి లేరు. అందరూ ఎన్‌డీఏ కూటమికి చెందిన వారే. తాజాగా జరిగిన సమావేశానికి కూడా జడ్పీ చైర్మన్ హోదాలో మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. అధికారులు నివేదిక చదివి విన్పించిన వెంటనే వేదిక మీద ఉన్న రాష్ట్ర మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి ప్రశ్నలు సంధించారు. గత ప్రభుత్వం, మంత్రులపై సైటర్లు వేశారు. అక్కడున్న వైసీపీ జడ్పీటీసీలు, ఎంపీపీలు వినాల్సి వచ్చిందే తప్పా తిరిగి సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది.



సమావేశంలో అరకు, విజయనగరం ఎంపీలు



హాజరైన పార్వతీపురం, కురుపాం ఎమ్మెల్యేలు విజయచంద్ర, జగదీశ్వరి

నేడు తోటపల్లి నీరు విడుదల

గరుగుబిల్లి: తోటపల్లి పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి, ఎడమ కాలువల ద్వారా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి శనివారం సాగునీరు విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే ఇంజనీరింగ్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి కురుపాం, పాలకొండ, రాజాం ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ, కోండ్రు మురళీమోహన్, ఉత్తరాంధ్ర నీటి పారుదల శాఖ ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ సుగుణాకరరావు తదితరులు హాజరుకానున్నారు. కాగా పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి, ఎడమ కాలవల ద్వారా వీరఘట్టం, పాలకొండ, వంగర, గరుగుబిల్లి, బలిజిపేట మండలాల్లో సుమారు 37వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. అయితే గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం కారణంగా కాలువలు అధ్వానంగా మారాయి. దీంతో శివారుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.

జిల్లా ఆసుపత్రి పన్ను బకాయి రూ.4.94 కోట్లు



పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రి

పార్వతీపురం టౌన్, జూలై 12 : పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రి పన్ను బకాయి రూ.4.94 కోట్లకు చేరింది. కొన్నాళ్లుగా మున్సిపాల్టీకి ఆస్తి పన్ను చెల్లించకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సామాన్యులు ఆస్తి, కొళాయి పన్నులు చెల్లించకపోతే వెంటనే స్పందించే మున్సిపల్ యంత్రాంగం ఆసుపత్రి విషయంలో ఏం చేస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. రూ.కోట్లకు బకాయి చేరేవరకు మున్సిపల్ అధికారులు ఏం చేస్తున్నారని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై మున్సిపల్ రెవెన్యూ అధికారి రూబేనును వివరణ కోరగా.. పలు ప్రభుత్వ కార్యాలయాలు ఎప్పటికప్పుడు పన్నులు చెల్లిస్తున్నప్పటికీ.. జిల్లా ఆసుపత్రి నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. ఈ విషయంపై పలుమార్లు జిల్లా ఆసుపత్రి అధికారులతోనూ చర్చించామని కమిషనర్ కె. శ్రీనివాసరావు చెప్పారు. దీనిపై జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వాగ్దేవిని వివరణ కోరగా మున్సిపాల్టీ నుంచి వస్తున్న బకాయి డిమాండ్ నోటీసులను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపిస్తున్నామని తెలిపారు.

గిరిజన మ్యూజియం

పనులు పూర్తి చేయండి

- అధికారులకు ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ ఆదేశం



ఆడలి వ్యూపాయింట్ పనులను పరిశీలిస్తున్న పీవో విష్ణుచరణ్

సీతంపేట: గిరిజన మ్యూజియం పనులు సకాలంలో పూర్తి చేయాలని సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో విష్ణుచరణ్ ఆదేశించారు. శుక్రవారం సీతంపేటలో మ్యూజియం, ఆడలి వ్యూపాయింట్ పనులను పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గోకులాలు, షెడ్ల నిర్మాణాల్లో జాప్యం లేకుండా చూడాలని సూచించారు. అనంతరం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. ఈ సీజన్‌లో రైతులకు వాటిని అందజేస్తే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాన్ని పరిశీలించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం పనికిరాదన్నారు. నాణ్యతలో రాజీ పడరాదని, నిర్దేశిత గడువు లోగా పనులు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. త్వరగా సందర్శకులకు అందుబాటులోకి తేవాలన్నారు. ఈ పరిశీలనలో ఏపీవో చిన్నబాబు, గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సింహాచలం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణకుమార్, జేఈ నాగభూషణ్ ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గొయ్యి..

- అధ్వానంగా జిల్లా రహదారులు
- వాహనదారులకు తప్పని అవస్థలు
- గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- మరమ్మతులకూ నిధులు కేటాయించని వైనం
- నిత్యం గోతుల్లో దిగబడుతున్న వాహనాలు

కొమరాడ, జూలై 12 : గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో రహదారులు అధ్వానంగా మారాయి. ఐదేళ్ల పాటు వాటి నిర్వహణను పట్టించుకోకపోగా.. మరమ్మతులకూ నిధులు కేటాయించలేదు. ఎక్కడా కొత్తగా రోడ్లను కూడా నిర్మించలేదు. దీంతో జిల్లాలో అనేక రోడ్లు భారీ గోతులతో ప్రమాదకరంగా మారాయి. నిత్యం ఏదో ఒకచోట గుంతల్లో వాహనాలు దిగబడుతున్నాయి. మరెంతో మంది వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు.



కొమరాడ సమీపంలోని అంతర్రాష్ట్ర రోడ్డు గోతిలో దిగబడిన లారీ

జిల్లాలో ప్రధానమైన పార్వతీపురం - కూనేరు అంతర్రాష్ట్ర రహదారి భారీ గుంతులతో వాహన చోదకులను భయపెడుతోంది. ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఇది ప్రధాన రహదారి అయినప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు. ఫలితంగా ఈ మార్గంలోని భారీ గోతుల్లో రోజూ వాహనాలు దిగబడి పోతున్నాయి. తరచూ గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోంది. వాహనదారులు నరకం చూస్తున్నారు. శుక్రవారం సాయంత్రం కూడా రాయగడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న లారీ కొమరాడ సమీపంలోని అంతర్రాష్ట్ర రోడ్డుపై గోతిలో దిగబడింది. దీంతో రోడ్డుకు ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. రాత్రి తొమ్మిది గంటల వరకు వాహనదారులు కదలలేకపోయారు.

మళ్లీ గురండిలో ...

భామిని: కొత్తూరు నుంచి బత్తిలి మార్గంలో గురండి వద్ద గోతిలో శుక్రవారం కూడా ఓ లారీ దిగబడింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు గంట తర్వాత యంత్రంతో లారీని పక్కకు జరపడంతో యథావిధిగా రాకపోకలు సాగాయి. దీంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు. అదే సమయంలో బస్సు రావడంతో దాన్ని ఎక్కేందుకు విద్యార్థులు ఎగ బడ్డారు. గురువారం కూడా ఈ రహదారి గోతిలో రెండు లారీలు కూరుకుపోవడంతో బత్తిలి వెళ్లే ప్రయాణికులు ఆటోలు, కాలినడకలతో గమ్యస్థానానికి చేరుకున్న విషయం తెలిసిందే. కాగా శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి ఈ రహదారి గోతుల్లో నీరు చేరింది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించలేక పోయారు. గుంతల మధ్య రోడ్డు ఎక్కడుందోనని వెతుక్కో వాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారీ వాహనాల దారి మళ్లించి, రోడ్డును బాగు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఛత్తీస్ ఘడ్-విశాఖ వాహనాలు ప్రయాణించే కీలక రహదారిని గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. నూతన ప్రభుత్వమైనా దీనిపై స్పందించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



భామిని: సింగిడి వద్ద రోడ్డు ఇలా..



గురండి రోడ్డు గోతిలో దిగబడిన లారీని బయటకు తీస్తున్న దృశ్యం

ఇవి సర్వేరాళ్లే..

ఇది మక్కువ మండలం పాయకపాడులో సర్వే రాళ్ల పరిస్థితి.. భూముల రీసర్వే అనంతరం సర్వే రాళ్లు ఏర్పాటు చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పింది. కానీ మండలంలో ఎక్కడివక్కడే వృథాగా దర్శనమిస్తున్నాయి. గతంలో మండలంలోని 21 పంచాయతీలకు గ్రామాల వారీగా సర్వేరాళ్లు పంపిణీ చేశారు. అయితే కొన్నిచోట్ల రీ సర్వే పూర్తికాలేదు. దీంతో సర్వేరాళ్లు ఎక్కిడికక్కడే విడిచిపెట్టేశారు. కొంతమంది వాటిని ఇళ్ల తీసుకెళ్లి వినియోగించుకోగా, మరికొందరు చెట్ల కింద ఇలా వేసుకుని సేద తీరుతున్నారు. ఏదేమైనా గత వైసీపీ సర్కారు తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. కోట్లాది రుపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన సర్వేరాళ్లను ఇలా వదిలేయడంపై పెదవి విరుస్తున్నారు. - మక్కువ



పాయకపాడు సమీపంలో వృథాగా ఉన్న సర్వే రాళ్లు




విజిలేస్కో...

తమిళ హీరో విజయ్ కథానాయకుడిగా వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ది గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్). శుక్రవారం చిత్ర బృందం తొలి పాటను విడుదల చేసింది. 'విజిలేస్కో' అంటూ సాగే ఈ మాస్ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. యువన్ శంకర్ రాజా స్వరాలు సమకూర్చడంతో పాటు నకాష్ అజీజ్‌తో కలసి ఆలపించారు. ప్రశాంత్, ప్రభుదేవా, స్నేహ, లైలా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ బేనర్ నిర్మిస్తోంది. సినిమాటోగ్రఫీ: సిద్దార్థ నుని.

ఆర్.సి 16లో శివన్న



రామ్‌చరణ్, జాన్వీ కపూర్ జంటగా రూపొందుతున్న ఆర్.సి. 16 చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ శుక్రవారం వచ్చింది. చిత్ర పరిశ్రమలో అందరూ ఆప్యాయంగా 'శివన్న' అని పిలుచుకునే శివ రాజ్‌కుమార్ ఇందులో నటిస్తున్నారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా సినిమాలో ఆయన లుక్‌ను విడుదల చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఆహ్వానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. 'ఉప్పెన' చిత్ర దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. సంగీత సంచలనం ఏ.ఆర్.రెహమాన్ ఈ సినిమాకు స్వరాలు అందిస్తున్నారు.



అప్పుడు సోలో.. ఇప్పుడు యుగళం

లవ్, రొమాంటిక్, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్.. ఈ జానర్లలో రూపుదిద్దుకునే చిత్రాలను ప్రేక్షకులకు దగ్గర చేసేవి వాటిల్లో పాటలే. సంగీతం ఇంత ముఖ్య పాత్ర పోషిస్తుంది కనుక పాటల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంటారు. ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నటిస్తున్న 'డార్లింగ్' చిత్రం నుంచి ఇప్పటి వరకూ రెండు పాటలు విడుదలయ్యాయి. ఇవి ప్రియదర్శి, నభా నటేశ్‌ల సోలో సాంగ్స్. ఇప్పుడు వీరిద్దరూ కలిపి పాడుకున్న లవ్ సాంగ్ 'సున్ చెలియా' ను శుక్రవారం విడుదల చేశారు. కాసర్ల శ్యామ్ రాసిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడారు. వివేక్ సాగర్ సంగీత దర్శకుడు. ఈ నెల 19న విడుదల కానున్న ఈ చిత్రాన్ని అశ్విన్ రామ్ దర్శకత్వంలో కె.ని రంజన్‌రెడ్డి, శ్రీమతి చైతన్య నిర్మించారు.

మా అల్లుడని డబ్బులిచ్చి ఆదుకున్నాం

లావణ్య తల్లితండ్రులు



ప్రస్తుతం టాలీవుడ్‌లో నటుడు రాజ్‌తరుణ్, లావణ్య వ్యవహారం ఓ హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటివరకూ లావణ్య మాత్రమే మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు ఆమె తల్లితండ్రులు కూడా మీడియా ముందుకు వచ్చి ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. చెప్పుకోలేని సంఘటనలు జరిగాయని కన్నీళ్లు పెట్టుకున్నారు. కరోనా సమయంలో రాజ్‌తరుణ్‌కి ఎవరూ సాయం చేయకపోయినా అతన్ని అల్లుడిగా భావించి డబ్బు సాయం చేసి ఆదుకున్నట్లు వారు చెప్పారు. 'మా అమ్మాయికి రాజ్‌తరుణ్ అన్యాయం చేశాడు. అతను ఎక్కడున్నా తీసుకువచ్చి వాళ్లిద్దరినీ కలిపేవరకూ వెనుకంజ వేయం' అని లావణ్య తండ్రి స్పష్టం చేశారు. లావణ్యకు డ్రగ్స్ తీసుకునే అలవాటు లేదనీ, అక్రమ సంబంధాలు ఉన్నాయనడం కట్టుకథ అనీ, ఓ ఆడపిల్ల మీద ఇలా నిందలు వేయడం తగదనీ ఆయన అన్నారు. తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయనీ, 'డ్రగ్స్ కేసులో నువ్వు బెయిల్ మీద బయటకు వచ్చావనీ, ఇలాంటి న్యూసెన్స్ చేస్తే బెయిల్ రద్దయి, ఇక జైలు నుంచి తిరిగి రాలేవని రాజ్‌తరుణ్, హీరోయిన్ మాల్వి బెదిరించారని లావణ్య చెప్పారు. రూ. ఐదు కోట్లు ఇచ్చి సెటిల్‌మెంట్ చేసుకుంటామని, కేసు వెనక్కి తీసుకోమని కూడా చెబుతున్నారని ఆమె వెల్లడించారు. 'నేను డ్రగ్స్ తీసుకుని ఉంటే రాజ్‌తరుణ్ కూడా తీసుకున్నట్లే. నేను వాటిని అమ్మితే .. అమ్మించింది అతనే. ఇందులో నిజం ఏమిటో పోలీసులే తేల్చాలి' అన్నారు లావణ్య. 'ఈ పోరాటం ఆపను. రాజ్ ఎక్కడ ఉంటే అక్కడికి వెళతాను. 14 ఏళ్ల పరిచయం, పదేళ్ల సహజీవనం ఎలా కాదంటాడో నేనూ చూస్తా' అని స్పష్టం చేశారు లావణ్య.

ప్రేమకథలు జీవితకాలం వెంటాడుతాయి



సంతోష్ శోభన్, సోషల్ మీడియాలో పాపులర్ అయిన అలేఖ్య హారిక జంటగా ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఎస్.కె.ఎన్., దర్శకుడు సాయిరాజేశ్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. సుమన్ పాతూరి దర్శకుడు. హీరో సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. ఇందులో ఉన్న 'ప్రేమకథలు జీవితకాలం వెంటాడుతాయి' అనే క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమయ్యే ఈ చిత్రం మ్యూజిక్ సిట్టింగ్స్ సంగీత దర్శకుడు విజయ్ బుల్గానిన్ సారథ్యంలో ప్రస్తుతం జరుగుతున్నాయి.

అక్షయ్‌కుమార్‌కు కరోనా



చిత్ర ప్రముఖుల్ని కరోనా రక్కసి ఇంకా వదిలి పెట్టలేదు. తాజాగా బాలీవుడ్ నటుడు అక్షయ్‌కుమార్ ఈ రక్కసి చేతికి చిక్కారు. ప్రపంచ కుబేరుడు ముఖేశ్ అంబానీ కుమారుడు అనంత్ వివాహానికి వెళ్లడం కోసం శుక్రవారం కొవిడ్ టెస్ట్ చేయించుకున్నారు. పాజిటివ్ రావడంతో పెళ్లికి వెళ్లడం మానుకుని ఇంటి గదికి పరిమితం అయ్యారు. తమిళంలో హిట్ అయిన సురారై పోట్రు' చిత్రం ఆధారంగా రూపొందిన 'సర్ఫిరా' చిత్రం శుక్రవారం విడుదల అయింది. ఈ సినిమా ప్రమోషన్స్ కోసం ఇటీవల చాలా చోట్లకు వెళ్లారు అక్షయ్. అప్పుడే ఆయనకు వైరస్ సోకి ఉంటుందని అంటున్నారు.

నా ప్లాపుల్ని ఎంజాయ్ చేస్తున్నారు

'సర్ఫిరా' ప్రమోషన్స్‌లో భాగంగా అక్షయ్ ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'నా ప్లాపుల్ని చూసి కొంతమంది ఎంజాయ్ చేస్తున్నారు. పరిశ్రమలో ఇలాంటి రాజకీయాలు బాధ కలిగిస్తున్నాయి' అని ఆవేదనతో చెప్పారు. ఏడాదికి నాలుగు సినిమాలు చేస్తూ, ఓవర్ ఎక్స్‌పోజ్ అవుతున్నాడంటూ వచ్చిన కామెంట్స్ ను ఆయన కొట్టి పడేశారు. 'నేను రెండేళ్లకు ఒక్క సినిమానే చేస్తా. అది హిట్ అవుతుందని ఎవరైనా గ్యారంటీ ఇవ్వగలరా?' అని అక్షయ్ ప్రశ్నించారు. 'వర్క్ చేస్తూనే ఉండాలి. నీ దగ్గరకు వచ్చిన అవకాశాల్ని పోగొట్టుకోకు. ఎవరి మాటా వినకు. నీ నటన ప్రేక్షకులకు నచ్చితే వాళ్లే నిన్ను నెత్తిన పెట్టుకుంటారు' అని అమితాబ్ చెప్పిన మాట పాటిస్తున్నా' అని చెప్పారు అక్షయ్.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/bmGd9pLలో చదవండి.

చిన్న సినిమా... వసూళ్లలో మిన్న

ఈ మధ్యకాలంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన చాలా చిత్రాలు బాక్సాఫీసు దగ్గర వసూళ్ల సునామీ సృష్టించడం చూసిందే. రూ. 300 కోట్లు, రూ. 500 కోట్ల వసూళ్లు అనే మాట చాలా సామాన్యంగా వినిపిస్తోంది. కానీ అవన్నీ భారీ బడ్జెట్‌తో తెరకెక్కడం వల్లే వసూళ్లు కూడా ఖర్చుకు తగిన స్థాయిలో వచ్చాయి. కానీ పరిమిత బడ్జెట్‌తో, అది కూడా ఎలాంటి స్టార్స్ లేకుండా వచ్చిన కొన్ని బాలీవుడ్ సినిమాలు రూ. వంద కోట్ల వసూళ్లను సాధిస్తున్నాయి. అగ్రహీరోలు, దిగ్గజ దర్శకులు లేకున్నా ఆకట్టుకునే కథలతో ప్రేక్షకులను అలరిస్తూ, కాసుల వర్షం కురిపిస్తున్నాయి.

ఓ సినిమా కమర్షియల్‌గా హిట్టా, ఫట్టా అనేది చెప్పడానికి రూ. 100 కోట్ల వసూళ్లు అనేది ఇప్పుడు ఓ కొలబద్దగా మారింది. అయితే అగ్రతారలకు సైతం అన్నిసార్లు ఈ ఫీట్ సాధ్యం కావడం లేదు. భారీ హైప్‌తో వచ్చిన పాపులర్ హీరోల చిత్రాలు సైతం బాక్సాఫీసు దగ్గర రూ. వంద కోట్ల వసూళ్లను దాటలేక చతికిలపడుతున్నాయి. దీనికి భిన్నంగా ఎలాంటి స్టార్స్ లేకుండా, కంటెంట్‌ను మాత్రమే నమ్ముకొని వచ్చిన కొన్ని చిన్న సినిమాలు బాలీవుడ్‌లో అలవోకగా వందకోట్ల మార్క్‌ను అధిగమిస్తున్నాయి.



కోట్లు కొల్లగొట్టిన పిల్లదెయ్యం



బాలీవుడ్ తాజా సంచలనం 'ముంజ్య' చిత్రం రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరింది. హారర్ కామెడీ జానర్ సత్తా ఏంటో మరోసారి చూపించింది. ఇందులో పేరున్న బాలీవుడ్ తారాగణం లేదు. శార్వరీ వాఘ్, అభయ్ వర్మ లాంటి చిన్న నటీనటులే. దర్శకుడు ఆదిత్య సర్పోదర్‌కు గతంలో భారీ హిట్లు ఇచ్చిన వ్యక్తి కాదు. అయినా 'ముంజ్య' మాత్రం విడుదలైన రెండు వారాల్లోనే రూ. వంద కోట్ల క్లబ్‌లో చేరింది. రూ. 30 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల వసూళ్లను సాధించింది. ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రాల్లో ఐదో స్థానంలో నిలిచింది.

అగ్రతారలు లేకున్నా కాసుల వర్షం


సీనియర్ నటీమణులు కరీనాకపూర్, టబు... యువ కథానాయిక కృతీసనన్ ప్రధాన తారాగణంగా రూపొందిన హీరోయిన్ ఓరియంటెడ్ మూవీ 'క్రూ' సైతం అంచనాలు మించి వసూళ్లను అందుకొంది. ప్రచార చిత్రాలతోనే ప్రేక్షకుల్లో ఆసక్తి ఏర్పడడంతో దాదాపు 2500 స్ర్కీన్లలో ఈ చిత్రాన్ని విడుదల చేశారు. ఈ కామెడీ థ్రిల్లర్ ప్రపంచవ్యాప్తంగా రూ. 150 కోట్ల వసూళ్లను సాధించింది. స్టార్ హీరోల రేంజ్‌లో ఈ చిత్రం వసూళ్లను సాధించడం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరిచింది.

కంటెంట్‌తోనే కలెక్షన్లు


కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో రూపొందిన హిందీ చిత్రం 'ఆర్టికల్ 370'. ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలైంది. రూ. 20 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం రూ. 110 కోట్ల వసూళ్లను సాధించింది. కథానాయికగా ఇప్పటివరకూ పెద్ద విజయాలు దక్కని యామీ గౌతమ్ ఈ సినిమాలో లీడ్‌రోల్ పోషించగా, ప్రియమణి కీలకపాత్రలో నటించారు. వీరు తప్ప పేరున్న నటీనటులెవరూ ఈ చిత్రంలో లేరు. ఆర్టికల్ 370ని తొలగించే క్రమంలో ప్రభుత్వానికి ఎదురైన సవాళ్లు, లోయలో శాంతి భద్రతలను కాపాడేందుకు మిలిటరీ చేసిన ఆపరేషన్స్‌ను దర్శకుడు ఆదిత్య సుహాస్ ఆవిష్కరించిన తీరు ప్రేక్షకులను మెప్పించింది. ఫలితమే బాక్సాఫీసు దగ్గర మంచి మార్కులు కొట్టేసింది.

సక్సెస్ బాటలో చిన్న సినిమా

కరోనా ప్రభావానికి బలైన చిత్రపరిశ్రమల్లో బాలీవుడ్‌ది అగ్రస్థానం. అప్పటివరకూ వరుస హిట్లతో కళకళలాడిన పరిశ్రమ కాస్తా ప్రేక్షకులు థియేటర్లకు రాక వెలవెలబోయింది. వరుస అపజయాలతో అగ్రహీరోలు, నిర్మాతలకు ఏం పాలుపోని పరిస్థితి. ఇంకా ఇప్పటికీ బాలీవుడ్ మునుపటి జోరు చూపించలేకపోతోంది. అగ్రహీరోలతో రూ. వందల కోట్లు ఖర్చుపెట్టి సినిమాలు తీసిన కొన్ని పెద్ద నిర్మాణ సంస్థలు దివాళా అంచుకు చేరాయి. ఈ పరిస్థితి ఇలా కొనసాగుతుండగా కొత్త తరహా కంటెంట్‌తో వచ్చిన కొన్ని చిన్న చిత్రాలు బాక్సాఫీసును దునేస్తున్నాయి.



అయితే కొంతమంది విమర్శకులు ప్రాపగాండా చిత్రాలుగా పేర్కొన్న 'ది కేరళ స్టోరీ', 'ది కశ్మీర్ ఫైల్స్' చిత్రాలు ఆశ్చర్యపరిచే వసూళ్లను సాధించాయి. మత మార్పిడికి గురైన అమాయక యువతి చివరకు సరిహద్దులు దాటి ఉగ్రవాద సంస్థ ఐసిస్ చెరలో బంధీగా మారిన వైనాన్ని ఇందులో చూపించారు. అదాశర్మ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలో పేరున్న బాలీవుడ్ నటీనటులు లేరు. కథ కూడా పూర్తిగా కేరళ నేపథ్యంలో సాగుతుంది. దక్షిణాదిన ఈ సినిమాకు కమర్షియల్‌గా లాభించకపోయినా ఈ సినిమా హిందీ వెర్షన్‌ను ప్రేక్షకలోకం అమితంగా ఆదరించింది. అందుకే రూ. 20 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం ఏకంగా రూ. 250 కోట్ల వసూళ్లతో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. 2022లో వచ్చిన 'కశ్మీర్ ఫైల్స్' చిత్రం సైతం రికార్డులను తిరగరాసిందనే చెప్పాలి. ఒక డాక్యుమెంటరీలా సాగే కథనంతో తెరకెక్కిన ఈ సినిమా ఊహించని వసూళ్లను సాధించింది. తొలి రోజు 600 స్ర్కీన్లలో విడుదల చేస్తే, వారం తిరగకుండానే నాలుగు వేల స్ర్కీన్లకు పెంచాల్సి వచ్చింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో రూ. 20 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రం కాస్తా రూ. 300 కోట్ల వసూళ్ల మార్క్‌ను అధిగమించింది. బాలీవుడ్‌లో విక్కీ కౌశల్‌కు ఒక్కసారిగా స్టార్‌డమ్ సంపాదించిపెట్టిన చిత్రం 'యురి' కేవలం రూ. 25 కోట్ల వ్యయంతో తెరకెక్కింది. ఈ చిత్రం హిందీ బెల్ట్‌లోనే రూ. 250 కోట్ల వసూళ్లను రాబట్టింది. ప్రపంచవ్యాప్తంగా రూ. 350 కోట్ల వసూళ్లను రాబట్టింది. పలువురు అగ్రహీరోల చిత్రాలను పక్కకునెట్టి 2019లో అత్యధిక వసూళ్లు సాధించిన మూడో చిత్రంగా నిలిచింది.



'తూకంలో మోసం అవాస్తవం'

విజయనగరం రింగురోడ్డు: దాసన్నపేట రింగురోడ్డు రైతు బజారులో రాయితీతో అందిస్తున్న కిలో కందిపప్పులో తక్కువ తూకం వచ్చినట్టు మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని మార్కెటింగ్ శాఖ ఏడీ రవికిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11న గురువారం రైతు బజారులో నిత్యావసర వస్తువుల స్టాల్‌ను ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు ప్రారంభించినప్పుడు కిలో కందిపప్పునకు గాను 900 గ్రాములు వచ్చినట్టు ప్రసార సాధనల్లో వార్తలు వచ్చాయని, ఇవి పూర్తిగా అవాస్తవమని తెలిపారు. ఇక్కడ రాయితీతో లభిస్తున్న కిలో కందిపప్పు, ఐదు కిలోల బియ్యాన్ని ఎలక్ట్రానిక్ కాటాలో తూకం వేసి ఖచ్చితంగా పరీక్షించిన తరువాతే ప్యాక్ చేస్తున్నట్టు తెలిపారు. కొనేముందు వినియోగదారులు తూకంలో ఏమైనా సందేహాలు ఉంటే, స్టాల్ వద్ద ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ కాటాలో పరీక్షించుకోవాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రాజాం రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రాజాం తహసీల్దార్ కృష్ణంరాజు స్పష్టం చేశారు. మొక్కల పెంపకంతో అది సాధ్యపడుతుందని అన్నారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఇక్కడి ఐసీడీఎస్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామఅప్పలనాయుడు, ఎం.పి.డి.ఒ. వావిలపల్లి శ్రీనివాసరావు, వికాసత రంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీటీడీ రమణమూర్తి, ఐసీడీఎస్ పీఓ కనకదుర్గ పాల్గొన్నారు.

ప్రధాన రహదారి విస్తరణ పనులకు ప్రణాళిక

రాజాం: రాజాం ప్రధాన రహదారి పనులు పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అంబేద్కర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశించారు. భోగాపురం ఎయిర్‌పోర్టును పరిశీలించడానికి వచ్చిన ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కలిసి రహదారి దుస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం వీటికి సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.

జీఓ 29, 42లను పునరుద్ధరించాలి

బొబ్బిలి: మెరుగైన విద్యా ప్రమాణాల కోసం 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 29, 42లను పునరుద్ధరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మెట్టవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనరు జేసీ రాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు బంకురు జోగినాయుడులు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన 84, 85, 117 జీఓలను తక్షణం రద్దు చేయాలని, వాటి స్థానంలో 29, 42 జీఓలను అమలు చేయాలని ఉపాధ్యాయులంతా ముక్తకంఠంతో కోరుకుంటున్నట్లు వారు తెలిపారు. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలు ఏ మాధ్యమంలో రాయాలో తెలియక విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తీవ్ర గందరగోళంలో ఉన్నారని, ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరారు. జిల్లా కార్యదర్శి సింహాచలం, రామకృష్ణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టి, ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

రామభద్రపురం: మట్టి, ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆకుల సులోచనారాణి హెచ్చరించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మైన్స్, రెవెన్యూ అధికారుల అనుమతులు లేకుండా ఏ ఒక్కరూ మట్టి తీసుకువెళ్లరాదన్నారు. అలా తీసుకెళ్లే వాహనాలను సీజ్ చేయడమే కాకుండా మట్టి తోలిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

కషాయం తయారీపై అవగాహన

వేపాడ: కుమ్మపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయ మండల ఎంటీ సన్యాసమ్మ, ఐసీఆర్‌పీ ఈశ్వరరావుల ఆధ్వర్యంలో శుక్రవారం దశపర్ణి కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కషాయం తయారు చేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నారాయణమ్మ, ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను వినియోగించుకోవాలి

రేగిడి: ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికను వినియోగించుకోవాలని ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దారు జె.రాములమ్మ ప్రజలకు సూచించారు. ఈ వేదిక అత్యంత జవాబుదారీగా పని చేస్తుందని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

రైతులకు ఊరటనిచ్చిన వర్షం

రేగిడి: మండలంలో శుక్రవారం కురిసిన వర్షం రైతులకు ఎంతో ఊరటనిచ్చింది. దమ్ముల సమయంలో సరైన వర్షాలు లేవని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ సమయంలో వర్షం కురవడంతో ఊరట చెందారు. సంకిలి, దేవుదళ, లక్ష్మీపురం, రేగిడి, ఆమదాలవలస, మజ్జిరామునిపేట గ్రామాల్లో వర్షం కురిసింది.

కౌలు రైతులకు అవగాహన

వీరఘట్టం: మండలంలోని కౌలు రైతులందరికీ కౌలు రైతు గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు శుక్రవారం హుస్సేన్‌పురం, విక్రంపురం, బొడ్లపాడు గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అర్హులైన కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు భాస్కరరావు, రామారావు, కీర్తిసుధ, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

18 నుంచి జిల్లా స్థాయి బాడ్మింటన్ పోటీలు

శృంగవరపుకోట రూరల్: ఈనెల 18 నుంచి 21 వరకు విజయనగరంలో జిల్లా స్థాయి బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ నూతన చైర్మన్ ఇందుకూరి రఘురాజు, కోచ్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. శుక్ర వారం బొడ్డవరలో వీరు మాట్లాడుతూ అండర్ -11 అండర్ -19 బాలబాలికల సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. విజయనగరం డీఎస్‌ఎ ఇండోర్ స్టేడియంలో పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. వివరాలకు 79891 99534, 99497 17172, 91337 73485 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

50 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం

గరుగుబిల్లి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో సుమారు 50 ఎకరాల్లో పండ్ల తోటలు పెంపకం చేపడుతున్నట్టు ఏపీవో ఎం.గౌరీనాథ్ వెల్లడించారు. శుక్రవారం ఆయన ఉపాధి హామీ పథకం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం చిలకాం, తోటపల్లి, సంతోషపురం, రావుపల్లి గ్రామాల్లో పండ్ల తోటలు పెంపకం చేపట్టామన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

రామభద్రపురం: రాష్ట్రంలోని ఎన్డీయే ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు యూరియా, డీఏపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతల రామకృష్ణ, ఎంపీటీసీ వసంతుల తిరుపతిరావు, రవ్వా ఈశ్వరరావు, విజయభాస్కరరావు, వంతుల వెంకటరావు, ఎంపీడీవో చుక్కా ఈశ్వరమ్మ, తహసీల్దార్ ఆకుల సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

టోల్‌గేట్ వద్దని తీర్మానం చేయండి


జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట, జూలై 12: విజయనగరం- విశాఖపట్టణం రోడ్డు గెద్దపేట వద్ద అక్రమంగా స్టేట్ హైవేపై ఏర్పాటు చేసిన టోల్‌గేట్‌ను ఎత్తివేయాలని జెడ్పీ సమావేశంలో తీర్మానం చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. శుక్రవారం జడ్పీ సమావేశానికి హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలిక సదుపాయాలు లేకుండా ఎక్కడైనా టోల్ వసూలు చేస్తే, స్థానిక సంస్థలకు చెందిన ప్రజాప్రతినిధులు, ప్రజలు అడ్డుకోవాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వివిధ సందర్భాల్లో ప్రస్తావించారన్నారు. జిల్లా పరిషత్ అనుమతి లేకుండా నిర్మించడం నిబంధనలకు వ్యతిరేకమన్నారు. వాహనాలకు రానుపోనూ రూ.240 వసూలు చేస్తున్నారన్నారు.

అంత్యక్రియలకు ఏర్పాట్లు

● నేడు సైనిక లాంఛనాలతో శంకర్రావుకు తుది వీడ్కోలు

బాడంగి, జూలై 12: బాడంగి మండలం బొత్సవానివలస గ్రామానికి చెందిన గొట్టాపు శంకరరావు (41) ఇండియన్ ఆర్మీలో జమ్మూ కాశ్మీర్‌లోని లడక్ ప్రాంతంలో సోల్జర్ (మెకానిక్)గా విధులు నిర్వహిస్తున్నారు. 17 ఏళ్ల వయస్సులో ఉద్యోగం సాధించిన ఆయన మరో ఆరు నెల ల్లో రిటైర్డ్ కానున్నారు. అలాంటి పరిస్థితుల్లో గురువారం ఉదయం జరగరాని ఘట నతో మృతిచెందారు. యూనిట్ నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం రావడంతో వారంతా కన్నీరుమున్నీరయ్యారు. దీంతో గ్రామంలో విషాదం అలముకుంది. శంకర రావు మృతదేహం ప్రత్యేక హెలికాప్టర్‌లో శుక్రవారం సాయంత్రానికి విశాఖకు చేరుకుంది. అక్కడి నుంచి వాహనంలో గ్రామానికి తీసుకువస్తారని తెలిసింది. ఈ విషయంపై సైనిక్ సంక్షేమ కార్యాలయానికి సమాచారం రావడంతో జిల్లా సైనిక సంక్షేమాధికారి కెప్టెన్ సత్యప్రసాద్‌తో పాటు జి.రమేష్ కార్యాలయ సిబ్బంది మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి, వారికి ధైర్యాన్నిచ్చారు. శనివారం జరగబోయే అంత్యక్రియలకు ప్రభుత్వ లంచనాలతో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల గౌరవ అధ్యక్షుడు మరడ అప్పారావుతోపాటు ఏపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ రెడ్డి అప్పలనాయుడు, జిల్లా మాజీ అధ్యక్షుడు సబ్బన సతీష్‌కుమార్, బొబ్బిలి మాజీ సైనిక సంఘ అధ్యక్షులు రెడ్డి దామోదర్, సంఘం అడ్వైజర్ తెంటు సత్యారావు, తదితర సైనిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. బాడంగి తహసీల్దార్ రాజారావు కూడా పర్యవేక్షించారు. ఈ ఘటన తెలుసుకున్న కాకినాడ జిల్లా సైనిక్‌సంక్షేమ అధికారి మజ్జి కృష్ణారావు ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ సైనిక ఉద్యోగులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

● మున్సిపల్ కమిషనర్


గాయత్రి కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్

రాజాం రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు స్పష్టం చేశారు. గాయత్రీ కాలనీలో శుక్రవారం ఉదయం శానిటరీ అధికారి ప్రసాదరావు, సిబ్బందితో కలిసి పర్యటించారు. కాలనీలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చెత్త, మురుగునీరు పేరుకుపోకుండా కాలనీవాసులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, శ్మశానవాటికలో బోరు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోటి, భీంపల్లి తిరుపతిరావు, చంద్రరావు, బలివాడ శ్రీనివాసరావు, పద్మ, తదితరులు కమిషనర్‌ను కోరారు.

పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయండి

రాజాం: ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని సాధన సమితి కన్వీనరు, రైతు సంఘ రాష్ట్ర కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజాం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడుతూ దీనిపై ఈనెల 15న కలెక్టర్ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు. తాటిపూడి రిజర్వాయర్, 40 ఏళ్ల దాటిన ప్రాజెక్టులలో పూడికలు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో రైతు పెంకి గౌరీశ్వరరావు, రైతు సంఘ జిల్లా అధ్యక్షులు నారు జనార్దనరావు, ప్రజా సంఘాల నాయుకుడు యాదవ్, కౌలు రైతుల సంఘం పార్వ తీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అప్పలనాయుడు

పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

బొబ్బిలి, జూలై 12: బొబ్బిలి మున్సిపల్ పట్టణ పరిధిలో అన్ని రకాల పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి లక్ష్యాలను సాధించాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు. స్థానిక కౌన్సిల్ సమావేశ హాలులో శుక్రవారం ఆమె అన్ని సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, ఎమినిటీ, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించి పన్నుల ప్రకియపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తిపన్ను, కుళాయిపన్ను, ఖాళీస్థలాలు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ అద్దెబకాయిల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వసూళ్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు. వసూళ్ల ప్రగతిపై ప్రతివారం సమీక్షిస్తామన్నారు. ప్రగతి చూపించలేని సెక్రటరీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి పి.ప్రసాదరావు, ఆర్ఐ త్రినాథరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

విజయనగరం రింగురోడ్డు: మార్కెట్లో పప్పుల ధరలు పెరగడంతో వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో తూనికలు, కొల తల శాఖ అధికారులు కిరాణా షాపుల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు మాట్లాడుతూ, బియ్యం, కందిపప్పు ధరలు పెరగడంతో ఎంఆర్‌పీ ప్రకారం విక్రయించకపోవడం, ప్యాకింగ్ చేసిన తీరు, ఇతర వివరాలు వంటివి లేకుండానే విక్రయిస్తున్నట్టు గుర్తించామన్నారు. ఈ మేరకు తనిఖీలు నిర్వహించినట్టు తెలిపారు. ముఖ్యంగా తూకాల్లో మోసాలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రిలయన్స్ మార్ట్, డీ మార్ట్‌లలో యూనిట్ ధర ప్యాకేజీపై లేకపోవడంతో కేసులు నమోదు చేశారు. సిబ్బంది ఉన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ దామోదరనాయుడు

బొబ్బిలి కోర్టులో న్యాయవిజ్ఞాన సదస్సు

బొబ్బిలి: స్థానిక కోర్టులో శుక్రవారం న్యాయసేవా కమిటీ చైర్‌పర్సన్, సీని యర్ సివిల్ న్యాయాధికారి అరుణశ్రీ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులంతా విధిగా హెల్మెట్లు ధరించాలని అన్నారు. హెల్మెట్లు ధరించకుండా వాహనాలు నడిపే వారే ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు మాట్లాడుతూ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధులు చల్లారపు సత్యనారాయణ, యాండ్రాపు మధుసూదనరావు, తమ్మిరెడ్డి దామోదరరావు, మత్స ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి అరుణశ్రీ

మార్కెట్ కమిటీలతో రైతులకు సేవలు: కళా

రాజాం: చీపురుపల్లి, మెరకముడిదాం మార్కెట్ కమిటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు మార్కెట్ కమిటీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం రాజాంలోని స్వగృహంలో ఆయనను కలిసిన వారు మార్కెట్ కమిటీలో ఉన్న సమస్యలను వివరించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులకు అవసరమైన సేవలు అందించాలన్నారు. సిబ్బంది సమస్య ఉంటే నామినేటడ్ పోస్టుల నియామకానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల పంచాయితీ కార్యదర్శులు కళాను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తమ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు.


కళాను కలిసిన మార్కెట్ కమిటీ కార్యదర్శులు

నారుమళ్ల పరిశీలన

కొమరాడ: ఏనుగుల గుంపుపాడు చేసిన వరి నారు మడులను రెవెన్యూ సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. మండలంలో మార్కొండపుట్టి గ్రామానికి చెందిన పంట పొలాలలో ఏనుగుల గుంపు గత రెండు రోజులుగా సంచరిస్తూ అరటి, వరి నారుమడులను నాశనం చేశాయి. వీటిని పరిశీలించి నష్ట పరిహారం నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.


పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అచ్చెన్నాయుడుకు శుభాకాంక్షలు తెలిపిన కోండ్రు

రాజాం: రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును అమరావతి సచివాలయంలోని అతని చాంబర్‌లో శుక్రవారం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి వారిని దుశ్శా లువతో సత్కరించి నియోజకవర్గంలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకు వెళ్లారు. అనంతరం కోండ్రు మురళీమోహన్ ఆంధ్రజ్యోతితో మాట్లా డుతూ రాజాం నియోజకవర్గంలోనే ఇప్పటికే 9 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయని, మరో ఐదు నూతన సబ్‌స్టేషణ్లు ఏర్పాటు ప్రతిపాదనలను విద్యుత్ మంత్రికి అంద జేశారు. అనంతరం ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్రకు శుభాకాంక్షలు తెలిపారు.


అచ్చెన్నాయుడును సత్కరిస్తున్న కోండ్రు

నాణ్యమైన విద్యను అందించాలి

వేపాడ: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాశాఖాధికారి పి.బాలభాస్కరరావు అన్నారు. చామలాపలి ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, విద్యార్థులను సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం ఆయన తరగతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజన పథకం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


పాఠశాలను సందర్శించిన ఎంఈవో

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

● మృతుడిది విశాఖ జిల్లా సబ్బవరం


నూకరాజు(ఫైల్)

భోగాపురం, జూలై 12: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ జిల్లా సబ్బవరం మండలం ఎరుకునాయుడు పాలానికి చెందిన గంద్రేటి నూకరాజు(36) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో విధుల్లో భాగంగా అదే గ్రామానికి చెందిన బంధువు ఏనుగుల రాముతో కలిసి హైదరాబాద్ నుంచి శ్రీకాకుళానికి లారీపై బిస్కట్ లోడును తీసుకువస్తున్నారు. అయితే వీరిది సబ్బవరం కావడంతో హైదరాబాద్ నుంచి సబ్బవరం చేరుకుని అక్కడ కొంత సమయం విశ్రాంతి తీసుకుని మరలా సబ్బవరం నుంచి శ్రీకాకుళానికి లారీతో శుక్రవారం బయలుదేరారు. శ్రీకాకుళం వైపు వెళ్లే రహదారిలో సుందరపేట సమీప జాతీయరహదారిపైకి వచ్చేసరికి అప్పటికే మరమ్మతులకు గురై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో డ్రైవర్ నూకరాజు అక్కడికక్కడే మృతి చెందగా ఏనుగుల రాముకు తీవ్రగాయాలయ్యాయి. మృతుడుకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు అన్నయ్య ఎంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పి.సూర్యకుమారి తెలిపారు.

వ్యక్తికి గాయాలు

కొమరాడ, జూలై 12: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ నీలకంఠం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా గోల్కొండ మండలానికి చెందిన అనిమిరెడ్డి అప్పలనాయుడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను సామాజిక తనిఖీ నిమిత్తం కొమరాడ వచ్చారు. ఈ క్రమంలో మండలంలోని బాలికల ఆశ్రమ పాఠశాల సమీపంలో గురువారం రాత్రి రహదారికి పక్క నుంచి నడిచి వస్తుండగా వెనుక నుంచి మోటార్ సైకిల్‌పై వచ్చిన వ్యక్తి బలంగా ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో అప్పలనాయుడు తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ తెలిపారు.

ఎలక్ట్రికల్ షాపులో చోరీ

శృంగవరపుకోట రూరల్, జూలై 12: మండల కేంద్రం శృంగవరపుకోటలో విశాఖ-అరుకురోడ్డులో ఉన్న శ్రీవాణి ఎలక్ట్రికల్స్‌లో దొంగలు పడి సుమారు రెండు లక్షల విలువచేసే పరికరాలు, రూ.4వేలు నగదు దోచుకున్నారు. ఈ విషయంపై శుక్రవారం దుకాణం యాజమాని గుడె రమణ మాట్లాడుతూ గురువారం రాత్రి దుకాణం మూసి ఇంటికి వెళ్లామని, అయితే శుక్రవారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు తలుపులు పగలకొట్టి ఉన్నాయన్నారు. దీంతో పరిశీలించగా 160 కేజీల కాపర్ వైరు, 115మీటర్ల కేబుల్ వైర్‌తో పాటు రిపేర్లుచేసి యాజమానులకు ఇవ్వాల్సి ఉన్న 9 మోటార్లతో పాటు నాలుగువేలు నగదును దొంగలు అపహరించారన్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై సీఐ మురళీరావును వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిందని దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

చిరు కార్మికుల తొలగింపు అన్యాయం

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని పార్కులో పనిచేస్తున్న కార్మికులను తొలగించడం చాలా అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శంకరరావు, రమణ అన్నారు. శుక్రవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. పార్కు కార్మికుల పేరుతో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి 36 లక్షల రూపాయలను డ్రా చేసి కార్మికులకు వేతనాల రూపేణా 10 లక్షల రూపాయలు మాత్రమే చెల్లించారని, మిగిలిన 26 లక్షల రూపాయలు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయన్నారు. ఈ వ్యవహారంలో అక్రమాలు జరిగిన నేపథ్యంలో ఆడిట్ అధికారులు అభ్యంతరం తెలిపారని, దీనిపై నిగ్గు తేల్చాల్సిన అధికారులు చిరుకార్మికులపై వేటు వేయడం అర్థరహితమన్నారు. పదేళ్లకు పైగా పనిచేస్తున్న వారిని ఇప్పుడు అర్ధాంతరంగా తొలగించి ఉపాధికి దూరం చేయడం సముచితం కాదన్నారు. నిధుల స్వాహాకు సంబంధించి సమగ్ర దర్యాప్తు జరపాలని శంకరరావు, రమణ డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

నాగూరులో డ్రైడే

గరుగుబిల్లి: మండలంలోని వివిధ పంచాయతీల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగూరు గ్రామంలో కాలువల్లో పూడిక తొలగింపు పనులను మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.సూర్యనారాయణ పరిశీలించారు. పూడికలు తొలగించిన అనంతరం దోమల నివారణ మందును పిచికారీ, బ్లీచింగ్ చల్లిస్తామని సర్పంచ్ కేతిరెడ్డి శిరీష, పంచాయతీ కార్యదర్శి సంధ్య తెలిపారు.

5 నుంచి 15 ఏళ్ల పిల్లలు బడిలో ఉండాలి

పార్వతీపురంటౌన్: ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల లోపు ఉన్న పిల్లలు బడిలో ఉండాలని, జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమావేశ మందిరంలో జిల్లాలోని 119 ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు చేయాలన్నారు.

తోటపల్లి ప్రాంగణంలో పరిశుభ్రతా చర్యలు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల ప్రాంగణంలో పిచ్చి మొక్కలు తొలగింపు చర్యలు చేపడుతున్నారు. ఈ నెల 10న ఆంధ్రజ్యోతిలో తోటపల్లికి పూర్వ వైభవం వచ్చేనా కథనం వెలువడింది. ఈ కథనంపై స్పందించిన ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణతో పాటు సిబ్బంది ఆలయ ప్రాంగణం పరిశుభ్రంగా ఉండేలా అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఆలయపరిధిలో సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించకుంటే క్రమ శిక్షణ చర్యలు చేపడతామన్నారు.

అర్చకులను నియమించాలి

రెండు దేవాలయాలకు సంబంధించి నలుగురు అర్చకులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక అర్చకుడే ఉండటంతో కొంతమేర భక్తులకు అసౌకర్యంగా నెలకొంది. సంబంధిత దేవాదాయశాఖ అధికారులు పూర్తిస్థాయిలో అర్చకులను నియమించి భక్తులకు సౌకర్యంగా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: మండలంలోని పారాది విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటలవరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని బొబ్బిలి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఆవాల అనంతరావు తెలిపారు. బొబ్బిలి గ్రోత్‌సెంటరులో గల 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో కూడా మరమ్మతు పనులు చేపడుతున్నందున శనివారం 11 కేవీ హెరిటేజ్, 11 కేవీ సాయి ఆగ్రో టెక్ ఫీడర్ల పరిధిలో గల వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వారంతా సహకరించాలని ఈఈ అనంతరావు కోరారు. ● **రాజాం:** మండలం పొగిరి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ వావిలిపల్లి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ● **కొత్తవలస:** మండలంలోని రామలింగపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోగల గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈ వి.సురేష్ బాబు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి 12 గంల వరకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేగిడి: ఉంగరాడమెట్ట సబ్‌స్టేషన్ 33 బై 11కేవీ నిర్వహణ సందర్భంగా మండలంలో ఐదు విద్యుత్‌ఫీడర్లకు శనివారం విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు స్థానిక విద్యుత్ ఏఈ ఎల్ హరిబాబు శుక్రవారం స్థానిక విలేఖర్లుకు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటవరకు విద్యుత్ ఉండదన్నారు. ● **వంగర:** మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం విద్యుత్ అంతరాయం ఏర్పడు తుందని విద్యుత్ శాఖ ఏఈ నవీన్ తెలిపారు. మండలకేంద్రంతో పాటు ఉంగరాడ మెట్ట వద్ద విద్యుత్ వైర్లు మార్పు చేయనున్న నేపథ్యంలో అపసాడ, మురువాడ, కింజంగి, కోనంగిపాడుతో పాటు మరికొన్ని గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహరించాలని కోరారు. ● **లక్కవరపుకోట:** మండలంలోని మల్లివీడు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్టు విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ● **విజయనగరం రింగురోడ్డు:** నగరంలో నిర్వహణ పనుల నిమిత్తం 11కేవీ అశోక్ నగర్, 33కేవీ బాబామెట్ట పరిధిలోని వివిధ ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ విభాగం డీఈ హరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా డబుల్ కాలనీ, కేంద్రీయ విద్యాలయం, ఏడు కోవెళ్ల, బాబామెట్ట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. ● నగరంలోని ఫూల్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎపీఈపీడీసీఎల్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీగణపతి కాలనీ, సిద్ధి వినాయకనగర్, అయ్యప్పనగర్, వేణుగోపాలపురం, కుమ్మరవీధి, లంకాపట్టణం, విజయలక్ష్మీనగర్, ఇప్పిలివీధి, సౌత్‌ఇండియా ఏరియా, మంగళవీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సంజీవనాయుడును తొలగించాలి

- జిల్లా కేంద్రాసుపత్రి వైద్యుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: జిల్లా ఆసుపత్రిలో ఫోరెన్సిక్ వైద్యుడిగా పనిచేస్తున్న ఎంకేవీ సంజీవనాయుడు వల్ల ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది నానా విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వాగ్దేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు శుక్రవారం సంజీవనాయుడును బదిలీ చేయాలంటూ ఆమె ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది జిల్లా ఆసుపత్రి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పోస్టుమార్టం వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న సంజీవనాయుడు ప్రవర్తన వల్ల ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఇతర వైద్యులు, వైద్య సిబ్బంది తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నారని తెలిపారు. వాట్సాప్ గ్రూప్‌ల్లో ఇబ్బందికర మెసేజ్‌లు పెట్టడం బాధాకరమన్నారు. ఈయన ప్రవర్తనపై కలెక్టర్, జేసీ ఆధ్వర్యంలో కమిటీ వేశారని చెప్పారు. సంజీవనాయుడును ఆసుపత్రి నుంచి పంపించాలని కలెక్టర్‌ను కోరుతామని తెలిపారు.

సంక్షేమ పథకాలు అందించాలి



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మికులు

పాలకొండ: భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం ఆవరణలో శుక్రవారం కోటదుర్గ మార్బుల్స్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. 1996 సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం భవన, నిర్మాణ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసిందన్నారు. కార్మికులకు పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగినా, రోడ్డు ప్రమాదాలు జరిగినా సంక్షేమ బోర్డు నుంచి రూ.5లక్షల వరకు సహాయం అందేదని చెప్పారు. గత మూడున్నర సంవత్సరాలుగా కార్మికులకు ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు కాలేదన్నారు. నూతన రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు నుంచి సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం కోటదుర్గ మార్బుల్స్ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఆర్తమూడి లక్ష్మణరావు, అధ్యక్షుడిగా వేణుగోపాలనాయుడు, ప్రధాన కార్యదర్శి రామదాసు, అప్పలనాయుడు, కోశాధికారి జాగీరు, ఉపాధ్యక్షుడు సాల్మన్, కార్యదర్శి మజ్జి శ్రీను, కమిటీ మెంబర్స్ చందక విశ్వేశ్వరరావు, మురపాక బాబూరావు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి కాద రాము, మార్బుల్ వర్కర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మందులు ఉంచండి

- గిరిజన సంఘ జిల్లా అధ్యక్షుడు అప్పారావు



తోణాం వైద్యునితో మాట్లాడుతున్న గిరిజన సంఘ నేతలు

సాలూరు రూరల్: తోణాం పీహెచ్‌సీలో మలేరియా, టైఫాయిడ్ వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సీదరపు అప్పారావు కోరారు. శుక్రవారం తోణాం పీహెచ్‌సీని ఆదివాసీ గిరిజన సంఘం ప్రతినిధులు సందర్శించారు. వైద్యుడు అజయ్‌కుమార్‌తో వైద్య సేవలపై చర్చించారు. ఈసందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో తొమ్మిది గ్రామ సచివాలయాలు, 14 పంచాయతీలు మొత్తం 23,010 మంది జనాభా ఉండగా, సిబ్బంది సరిపడ లేరని తెలిపారు. పీహెచ్‌సీలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు అధికంగా వస్తున్నాయని, వాటికి పీహెచ్‌సీలో మందుల కొరత ఉందని ఆయన చెప్పారు. దీంతో సాలూరు ఏరియా ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుందన్నారు. పీహెచ్‌సీలో అన్ని వ్యాధులకు మందులను అందుబాటులో ఉంచాలన్నారు. పీహెచ్‌సీలోనే అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. కురుకూటిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నేతలు సుందరరావు, జానకీరావు తదితరులు పాల్గొన్నారు.

మోటారు వాహన చట్టంపై అవగాహన ఉండాలి

- జూనియర్ సివిల్ న్యాయాధికారి విజయరాజ్‌కుమార్



మాట్లాడుతున్న న్యాయాధికారి విజయరాజ్‌కుమార్

పాలకొండ: మోటారు వాహన చట్టంపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.విజయరాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టులో న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టి.రామ్మోహన్, పి.మునిస్వామి, ఏ.గోవిందరావు, ఎంవీ వెంకటేశ్వరరావు, కె.రవి, కె.వెంకటరమణ, ఎం.జగన్మోహన్‌రావు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తోటపల్లి ఆలయాల హుండీ లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: తోటపల్లి గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీకోదండరామస్వామి ఆలయాల హుండీలు లెక్కింపు కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. భక్తుల నుంచి కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని గ్రామ పెద్దలు, దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో తెరిచి లెక్కించినట్టు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వీవీ సూర్యనారాయణ తెలిపారు. సుమారు 107 రోజులకు గాను శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.4,15,205 ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. కోదండరామస్వామి ఆలయానికి రూ.8,045 ఆదాయం వచ్చిందన్నారు. పార్వతీపురం గ్రూపు దేవాలయాల కార్యనిర్వాహణాధికారి ఎం.ప్రసాద్ పర్యవేక్షణలో హుండీల లెక్కింపు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు వీవీ అప్పలాచార్యులు, మార్కొండ వాసునాయుడు, మార్కొండ పకీరునాయుడు, దేవస్థానం సిబ్బంది మార్కొండ మురళీనాయుడు, మరిశర్ల బలరాంనాయుడు, గంట శ్రీధర్‌నాయుడు, పి.పోలిరాజు పాల్గొన్నారు.

ప్రయాణికులకు తప్పని పాట్లు

- అభివృద్ధికి నోచుకోని రహదారులు
- పలుచోట్ల నత్తనడకన సాగుతున్న పనులు

పలు గ్రామాల్లోని రహదారులు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. మట్టి రహదారులే దర్శనమిస్తున్నాయి. వర్షం వచ్చిందంటే చిత్తడిగా మారుతున్నాయి. గోతుల్లో వర్షం నీరు నిలవడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. పలుచోట్ల రహదారి నిర్మాణాన్ని ప్రారంభించి, అర్ధాంతరంగా విడిచిపెట్టడంతో రాళ్లు తేలిన దారుల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



వర్షం పడితే నరకమే

గరుగుబిల్లి: చిలకాం ప్రధాన రహదారిపై ప్రయాణం నరక యాతనగా తయారైంది. వర్షం పడిందంటే గోతుల్లో వర్షపు నీరు చేరి..ప్రమాదకరంగా తయారవుతుంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసింది. అయితే పనులు ప్రారంభిస్తున్న తరుణంలో ప్రభుత్వం మారడంతో నిధులు వెనక్కి మళ్లాయి. గత ఐదేళ్లగా ప్రధాన రహదారి నుంచి సుమారు రెండు కిలో మీటర్ల మేర అడుగడుగునా గోతులే దర్శనమిస్తున్నాయి. నాగూరు ఎంపీటీసీ సభ్యులు, అరకు తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ సొంత నిధులు వెచ్చించి రహదారిని మెరుగుపర్చారు. టీడీపీ ప్రభుత్వంలోనైనా రహదారి మెరుగుకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. స్థానిక శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి చొరవ చూపి ప్రజలకు సౌకర్యంగా ఉండేలా దృష్టి సారించాలని కోరుతున్నారు.

రాళ్లు వేసి వదిలేశారు

వీరఘట్టం: మండలంలోని సీఎస్‌సీ రోడ్డు నుంచి పాలమెట్ట వయా చిదిమి మీదుగా చేపట్టిన బీటీ రహదారి నిర్మాణ పనులకు గత ఏడాది అక్టోబరు 12న శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగుతున్నాయి. రహదారి పనుల్లో భాగంగా రోడ్డుపైన రాళ్లు వేసి నెలలు గడుస్తున్నా బీటీ మాత్రం వేయలేదు. దీంతో చిదిమి, పాలమెట్ట గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ కారణంగా ఆటోలు కూడా ఈ రోడ్డు వైపు తిరగడం మానేశాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రహదారి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై జేఈ నాగభూషణం వద్ద ప్రస్తావించగా త్వరలో రహదారి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.





పార్వతీపురంటౌన్, సాలూరు రూరల్, పాలకొండలో వామనావతారంలో జగన్నాథస్వామి

వామనావతారంలో జగన్నాథుడు

పార్వతీపురంటౌన్: శ్రీజగన్నాథస్వామి రథయాత్రలో భాగంగా జిల్లా కేంద్రంలోని గుడించా మందిరంలో శుక్రవారం జగన్నాథుడు వామనవతారంలో దర్శనమిచ్చాడు. ఈవో ప్రసాదు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. **సాలూరు రూరల్:** స్థానిక గుడించా మందిరంలో జగన్నాథుడు శుక్రవారం వామనావతరంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. **పాలకొండ:** పట్టణంలో వెలసిన జగన్నాథస్వామి రథోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారు వామన, పరశురాముని అవతారంలో భక్తులకు శుక్ర వారం దర్శనం ఇచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని ప్ర త్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు మఠం విశ్వనాథ్‌దాస్ భక్తులతో పూజలు చేయించారు. ఈవో సర్వేశ్వరరావు భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నారు.

హిందీ మాధ్యమంలో బోధన తగదు

గుమ్మలక్ష్మీపురం: జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, ఆనసభద్ర, కొటికిపెంట ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలకు ఇటీవల నూతన ఉపాధ్యాయులు నార్త్ ఇండియా నుంచి వచ్చారు. వారు హిందీ మద్యమంలో బోధించడంతో గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇంగ్లీష్, తెలుగులో బోధించేవారు. ఇప్పుడు సైన్స్, సోషల్, ఇంగ్లీష్, లెక్కలు కూడా హిందీలోనే బోధిస్తున్నారు. దీంతో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు మరింత ఆందోళన చెందుతున్నారు. హిందీ తప్ప మరే ఇతర భాషలు రావడం లేదని, ఏకలవ్య పాఠశాలలో పరిస్థితులు చక్కబడే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. ఈ పాఠశాలలపై సమీక్ష జరపాలని, గిరిజన విద్యను కాపాడాలని గిరిజన సంక్షేమ సంఘం తరపున వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

● **పార్వతీపురం రూరల్:** జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురపాం, అణసభద్ర, కుటిక పెంట ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలల్లో ఇటీవల నూతన ఉపాధ్యాయులు నియమించారని, వారు అన్ని సబ్జెక్టులను హిందీలో బోధించడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు రంజిత్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏ సమస్య చెప్పుకోవాలన్నా ఆయా పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్ నుంచి ఉపాధ్యాయుల వరకు ఏ ఒక్కరికీ హిందీ తప్ప మరొక భాష రాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆ వ్యక్తిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలి

- జిల్లా వైదిక పరిషత్ సభ్యులు



ఏఎస్పీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న వైదిక పరిషత్ సభ్యులు

పార్వతీపురంటౌన్: బ్రాహ్మణ, పురోహితులను దుర్భాషలాడటం హిందూ వ్యవస్థకే కళంకమని, అలాంటి వ్యక్తిపై వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని జిల్లా వైదిక పరిషత్ సభ్యులు ఏఎస్పీ దిలీప్ కిరణ్‌కు విన్నవించుకున్నారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఆయనను కలిసి.. బ్రాహ్మణ స్త్రీలు, వైదికుల పట్ల ఓ వ్యక్తి అనుచిత వాఖ్యలు, దుర్భాషలాడటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. అతడ్ని అరెస్టు చేసి హిందూ ధర్మాన్ని రక్షించాలని ఆ సంఘ సభ్యులు వేమకోటి నరహరశాస్త్రి, వృద్ధుల శేషు, వి.నాగభూషణశర్మ, ఎ.వాసుదేవశర్మ, వి.నీలకంఠశర్మ, తదితరులు కోరారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన అప్పలనాయుడు

పాలకొండ: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శి అప్పలనాయుడు శుక్రవారం విజయవాడలో మర్యాపూర్వకంగా కలిశారు. ఇప్పుడున్న టీడీపీ పాలకొండ ఇన్‌చార్జి భూదేవి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి నిమ్మక జయకృష్ణకు వ్యతిరేకంగా పనిచేశారని, వైసీపీ ఎమ్మెల్యే కళావతికి సపోర్టు చేశారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఇన్‌చార్జిగా ఆమెను తొలగించాలలని వినతిపత్రం అందించారు.

పంచాయతీల్లో అప్రమత్తంగా ఉండాలి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల పంచాయతీ విస్తరణాధికారి ఎల్.గోపాలరావు సూచించారు. మండలంలోని గరుగుబిల్లి, పెద్దూరు పంచాయతీలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా కాలం దృష్ట్యా గృహాలకు ఆనుకుని మురుగు నిల్వలు లేకుండా తొలగించాలని ఆదేశించారు. క్లోరినేషన్‌తో పాటు దోమల నివారణకు పిచికారీ చేయాలన్నారు. సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌరీశంకరరావు, కార్యదర్శులు ద్వారపురెడ్డి జగదీష్, బి.సుభద్రతో పాటు సర్పంచ్ ఎం.నారాయణమ్మ, ఉప సర్పంచ్ తెర్లి యల్లంనాయుడు పాల్గొన్నారు.

పారిశుధ్య వారోత్సవాలు పక్కాగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో దేవకుమార్

మక్కువ: ఈనెల 16 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు జరగనున్న పారిశుధ్య వారోత్సవాలను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో దేవకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సన్నిబాబు, ఉపాధి ఏపీవో ఎస్.ఈశ్వరమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వీధులను శుభ్రంగా ఉంచాలి

వీరఘట్టం: వీరఘట్టం పట్టణంలోని బార్నాలవీధిలో శుక్రవారం ఎంపీడీఓ ఎం.వి.బి.సు బ్రహ్మణ్యం పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ వీధులను శుభ్రంగా ఉంచాలని సూచించారు. డయేరియా, మలేరియా వంటివి ప్రబలే అవకాశం ఉన్నందున జా గ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్ల కలక నివారణకు ప్రత్యేక వైద్య శిబిరం

కురుపాం: కురుపాంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, నేత్ర వైద్య అధికారి నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. కళ్లకలకలు వచ్చే కాలం అయినందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని నగేష్ రెడ్డి సూచించారు. 38 మందికి నేత్ర పరీక్షలు జరిపి ఇద్దరికి కళ్ల కలకలు ఉన్నట్టు గుర్తించి వారికి చికిత్స చేశారు. దృష్టి లోపం ఉన్నవారికి కళ్లద్దాలు సిఫారుసు చేశారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య సహాయకులు రమేష్, మాలిక, శిరీష, ఆరోగ్య మిత్ర సురేష్ మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

జీసీడీ పాఠశాలకు క్రీడా పురస్కారం



చెక్కును అందజేస్తున్న బసంతకుమార్

రాయగడ: స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను క్రీడా పురస్కారం దక్కింది. రాష్ట్రంలో 30 పాఠశాలలు క్రీడారంగంలో ఎంపికయ్యాయి. అందులో జీసీడీ పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడల్లో అత్యున్నత ప్రతిభను చాటి పాఠశాల ఘనతను చాటిచెప్పారు. దీంతో పాఠాశాలకు రూ.10వేలు నగదు పురస్కారాన్ని విద్యాశాఖాధికారి బసంతకుమార్ నాయక్ హెచ్‌ఎం నమితకు అందజేశారు. ఈ ఏడాది 55 మంది విద్యా ర్థులు వివిధ క్రీడల్లో సత్తాచాటి అవార్డులు సాధించారని, నలుగురు విద్యార్థులు బాక్సింగ్‌లో రెండు రజిత, రెండు కాంస్య పతకాలు సాధించా రని వ్యాయమ ఉపాధ్యాయుడు సునీల్‌కుమార్ మహంతి తెలిపారు.

వామన రూపంలో జగన్నాథుడు



రాయగడ: జగన్నాథుని రథాయాత్రలో భాగంగా గండిచా మందిరంలోని జగన్నాథస్వామి శుక్రవారం వామన అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు సాయిప్రియ మహిళ వాకర్స్ క్లబ్ సభ్యులు ప్రసాద వితరణ చేశారు.

రాయగడలో డీఆర్‌ఎం పర్యటన



పనుల ప్లాన్ పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

ఒడిశా

రాయగడ: తూర్పు కోస్తా రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్ శుక్రవారం విజయనగరం- రాయగడ స్టేషన్ల మధ్య సెక్షన్ తనిఖీ నిర్వహించారు. మూడో లైన్ పనుల పురోగతి, స్టేషన్ల అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాల మెరుగు, వంటి అంశాలను పరిశీలించారు. రాయగడ రైల్వే స్టేషన్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సర్క్యు లేటింగ్ ప్రాంతాలు, పార్కింగ్, స్టేషన్ భవనాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించారు. డీఆర్‌ఎం వెంట ఏడీఆర్‌ఎం (ఆపరేషన్స్) మనోజకు మార్ సాహు ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు.

క్లుప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సాలూరు రూరల్: దేవుబుచ్చింపేట వద్ద ఉన్న 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫారకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఈఈ వీవీ కిశోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహణ పనులు వల్ల విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కూర్మరాజుపేట, జీగిరాం, సాలూరు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. అలాగే మక్కువ మండలంలో మక్కువ, వెంకటబైరిపురం, కన్నంపేట, దబ్బగెడ్డ, నగుళ్ల, ములక్కాయవలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. పాచిపెంట 33 కేవీ ఉపకేంద్రం నిర్వహణ పనుల వల్ల ఆ కేంద్రం పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

లుంబూరు ఉప కేంద్రం పరిధిలో..

పాలకొండ: లుంబూరు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. లుంబూరు సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు గరుగుబిల్లి, జేహెచ్‌సీ కాలనీ, కస్పావీధి, చిన్న కాపు, పెద్దకాపు వీధి, నెయ్యిల వీధి, దేవరపేట, కోమటిపేట, బోనంవీధి, రెల్లివీధి, వెంకంపేట, వీవర్స్ కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, సహకరించాలన్నారు.

ఎర్రసామంతవలస సబ్‌స్టేషన్ పరిధిలో..

మక్కువ: ఎర్రసామంతవలస సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న మార్కొండపుట్టి, వైఎస్‌వలస, బొడ్డుసామంతవలస ఫీడర్లకు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పార్వతీపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వీవీ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

పెదమేరంగి..

జియ్యమ్మవలస: మండలంలో పెదమేరంగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనుందని విద్యుత్‌శాఖ ఏఈ బడే శ్రీనివాసనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న చినమేరంగి ఫీడర్, చంద్రశేఖరరాజపురం ఫీడర్, ఆర్‌ఆర్‌బీ పురం ఫీడర్, పరజపాడు ఫీడర్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలకు శనివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. దీని కారణంగా విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మెంటైనెన్స్ పనులు చేపడుతున్నామన్నారు. దీనిని సంబంధిత విద్యుత్ వినియోగదారులు, ప్రజలు అర్థం చేసుకొని సహకరించగలరని ఆయన కోరారు.

గరుగుబిల్లిలో..

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని 33 కేవీ లైన్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నారు. ఈ విషయాన్ని గమనించాలని మండల విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ బి.శంకరరావు తెలిపారు.